# నవ్వినా కన్నీళ్ళే

డాక్టర్ ఎమ్. సుగుణారావు

తలస్నానం చేసి జుట్టు తుడుచుకోకుండా వచ్చిన భర్తను చూసి, 'ఈ మతిమరుపు మొగుడితో చస్తున్నాను' అనుకుంటూ జగన్నాథం జుట్టు టవల్‌తో తుడిచి వంటగదిలోకి వెళ్ళింది సుమతి.

– అరగంట తర్వాత ''వెళ్ళొస్తాను సుమతీ'' అన్నాడు జగన్నాథం బైటకు వస్తూ.

భర్తను పరిశీలనగా చూస్తూ 'అమ్మయ్య. అన్నీ సరిగ్గానే వేసుకున్నారు...' అనుకుంటూ...'' ఈరోజేంటో తెలుసా!'' అని అడిగింది.

''మన పెళ్ళిరోజు..అది కూడా మరిచిపోతాననుకున్నావా?!'' అన్నాడు నవ్వుతూ.



''అయితే రాత్రి ఫస్ట్ షో సినిమాకు వెళదాం, యూనివర్శిటీ నించి సరాసరి సినిమా హాలుకు వచ్చెయ్యండి, నేనూ ఆఫీసునుంచి సినిమా హాలుకు వచ్చి టిక్కెట్లు తీసి మీ కోసం ఎదురుచూస్తాను...'' అంది.

''అలాగే '' అంటూ బయలుదేరుతున్న భర్తను ఆపి, ''ఇంతకీ ఏ సినిమా హాలు?'' అని అడిగింది టెస్ట్ చేద్దామని.

''అదే 'గతి తప్పిన భార్య, మతిలేని భర్త' ఆడుతున్న సినిమా హాలే కదా!'' అన్నాడు జగన్నాథం.

''అదికాదు. 'పసుపుతాడు' ఆడుతున్న సినిమాహాలుకు. చాలా బావుందట.''

''ఔను. సినిమా టిక్కెట్టుతోపాటూ, జేబురుమాలు కూడా ఇస్తున్నారట...!'' అంటూ గుర్తుచేశాడు.

''ఔను. అంత ఏడుపొస్తుందట...మీ మతిమరపుతో నవ్వలేక చస్తున్నాను...కాసేపయినా ఏడుద్దామని'' అంది నవ్వుతూ.

జగన్నాథమూ ఆమె మాటలకు నవ్వుకుంటూ స్కూటర్‌మీద యూనివర్శిటీకి బయలుదేరాడు.

ఇంతలో ఫోన్ మోగింది. సుమతి ఫోన్ ఎత్తింది. ఆమె స్నేహితురాలు.

''నీ కూతుర్ని మీ అమ్మగారి దగ్గర వదిలేసావుట...ఎందుకూ క్రెచ్‌లో వెయ్యి. మనలాంటి ఉద్యోగం చేసే ఆడవాళ్ళకు

మంచి సదుపాయం...'' అంది ఆమె స్నేహితు రాలు.

''వద్దులే..కొన్ని రోజులు అలాగే క్రెచ్‌లో వేసాను. ఓ రోజు క్రెచ్ నించి పిల్లలను పార్కుకు తీసుకెళ్ళి ఆమె ఆడుకుంటుంటే మర్చిపోయి యూనివర్శిటీకి వెళ్ళిపోయాడు... పిల్ల 'డాడీ' అని ఏడుస్తూ కూర్చుంది. ఎవరో తెలిసినవాళ్ళు తీసు కొచ్చి అప్పచెప్పేరు. అలాంటి మతిమరుపు మొగు డితో కూతుర్ని ఎలా వుంచమంటావ్!? అంది సుమతి నవ్వుతూనే.

''ఇంతకీ మీ ఆయన నీతో ఎలా వుంటాడు. మంచి వాడేనా?'' అని అడిగింది.

''ఈ మతిమరుపు తప్ప ఏ అవలక్షణం లేని అతి మంచి భర్త. నన్ను ప్రాణంలా చూసుకుంటారు. మరేం చెయ్యను...'' అంది సుమతి.

ఆమె స్నేహితురాలు ఫోన్ పెట్టేసింది.

సుమతి గబగబా తయారై ఆఫీసుకు బయలుదే రింది.

***

క్లాసు రూములోకి వెళ్ళిన జగన్నాథాన్ని ఎక్కి రిస్తూ 'అయోమయం జగన్నాథం...!' అనే అక్ష రాలు బ్లాక్‌బోర్డు మీద

కన్పించాయి. వాటిని చూసి నవ్వుకున్నాడు.

'ఔను. తన మతిమరుపు గురించి యూనివర్శి టీలో కథలు, కథలుగా చెప్పుకుంటారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ జగన్నాథం అంటే ఎవరికీ తెలీదు. 'ప్రొఫె సర్ అయోమయం' అంటేనే తెలుస్తుంది.' అయినా తను బాధపడడు. కుంటి, మూగ, చెముడులా ఈ మతిమరుపు తనకొక వైకల్యం....' అని సమాధాన పడి పాఠం చెప్పడం ప్రారంభించాడు జగన్నాథం. లంచ్ టైము వరకూ క్లాసులు తీసుకుని కేంటీన్‌కు బయలుదేరాడు.

కేంటిన్‌లో కూర్చుని టిఫిన్ తినడం ప్రారంభించిన జగన్నాథానికి తన వెనక ఇద్దరమ్మా యిలు గుసగుసగా అనుకుంటున్న మాటలు విని పించాయి.

''ఇంతకీ ఈయనకు అయోమయం అనే పేరు ఎందుకొచ్చినట్టు?!'' ఒక మ్మాయి ప్రశ్నించింది.

''ఈయనకు మతిమరుపు జాస్తి. మా వీధిలోనే వుంటారు. ఒకసారి ఈయన భార్య ఇంట్లో లేనపుడు పొయ్యిమీద పాలుపెట్టి మరిచిపోయారు. ఆ పాలు పొంగి కోవా అయిపోయి స్టవ్ ఆరిపోయి, వీధంతా గాస్ వాసన కొట్టేవరకూ కూడా తెలీదు ఈయనకు పొయ్యిమీద పాలు పెట్టిన విషయం...'' అంది రెండో అమ్మాయి.

''మై గాడ్'' అంది ప్రశ్నించిన ఆ అమ్మాయి.

''ఇంకోసారి తనదనుకుని ఇంకో వ్యక్తి స్కూటర్ తీసుకువెళ్ళి సాయంత్రం వరకు తిరిగాడు. ఆ స్కూటర్ సొంతదారు పోలీస్ కంప్లయింట్ ఇచ్చి పోలీసులు ఈయనను పట్టుకునే వరకూ తెలీదు ఈయనకు ఆ స్కూటర్ వేరే వాళ్ళదని'' అంది రెండో అమ్మాయి తన సంభాషణ కొనసాగిస్తూ...

''అయ్యో ఆయోమయం...'' అంది మొదటి అమ్మాయి.

''ఈయనగారి భార్య ఎలా వేగుతోందో! ఈ మతిమరుపు ప్రొఫెసర్ ఎపుడో ఒకప్పుడు ఊపిరి పీల్చడం కూడా మర్చిపోయి పోతాడేమో!'' అంది రెండో అమ్మాయి. మొదటి అమ్మాయి ఆ మాటలకు పకపకా నవ్వింది.

జగన్నాథం వారి మాటలు ఇంక వినలేకపో యాడు. గబగబా కేంటిన్ నుంచి బైటకొచ్చేసాడు. దారిలో అతడి కొలీగ్ సుబ్రహ్మణ్యం ఎదుర య్యాడు.

''మీ ఆవిడ ఫోన్ చేసింది. కేంటిన్ లో వున్నా వని చెప్పాను.'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''ఏమంది?!'' అన్నాడు జగన్నాథం.

''ఏమీ చెప్పలేదు. 'పసుపుతాడు' అనండి చాలు. ఆయనకే అర్థమవుతుంది'' అని ఫోన్ పెట్టే సింది.'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

''పసుపుతాడా...!'' అంటూ ఆలోచనల్లో పడ్డాడు జగన్నాథం.

'బహుశా తనను కొని తెమ్మన్నదేమో!' అనుకు న్నాడు. కేంటిన్‌లో అమ్మాయిల మాటలతో విచా రంలో వున్న జగన్నాథానికి భార్య తనను సిని మాకు రమ్మని చెప్పిన విషయం గుర్తుకురాలేదు. మౌనంగా నడుస్తున్నాడు.

అది గమనించిన సుబ్రహ్మణ్యం.. ''ఏమిటీ డల్‌గా వున్నావ్!'' అని పరామర్శించాడు.

''నేను రోజు రోజుకీ నవ్వులపాలవుతున్నాను. నా మతిమరుపుతో.'' అన్నాడు బాధగా. అతని మాటల్లో విచారం కనిపెట్టి చెప్పాడు సుబ్ర హ్మణ్యం..

''జంధ్యాలగారు ఒక కవిత చెప్పారు. అదేమి టంటే...

'నవ్వించడం ఒక యోగం


నవ్వడం ఒక భోగం

నవ్వకపోవడం ఒక రోగం...' అయితే నేను వారు చెప్పిన కవితకు నాలుగో పాదం పూరించాను. అది...'నవ్వులపాలు కావడం ఒక త్యాగం!' అని . అంచేత బాధపడకు. నువ్ కొవ్వొత్తిలాంటివాడివి. కాలుతూ వెలుగునిస్తావ్. పదిమందికీ నవ్వులు పంచుతున్నావ్, నీకు దీని వలన పుణ్యమే లభిస్తుంది..'' అంటూ సుబ్ర హ్మణ్యం వెళ్ళి పోయాడు.

జగన్నాథం సాయంత్రం వరకూ క్లాసులు తీసు కొని ఇంటికి బయలుదేరాడు. భార్య ఫోనులో పసు పుతాడు అని సుబ్రహ్మణ్యంతో చెప్పిన విషయం గుర్తుకొచ్చి మార్కెట్‌కు వెళ్ళి చాలా షాపులు తిరిగి పసుపుతాడు కొనుక్కొని ఇంటికి బయలుదేరాడు. ఇంటికి వెళ్ళేసరికి రాత్రి ఏడయ్యింది. తలుపుకు తాళం కప్ప వేసి వుంది. 'బహుశా ఆఫీసులో పని వుండడంతో ఉండిపోయిందేమో..!' అనుకుంటూ తన దగ్గరున్న తాళంచెవితో జగన్నాథం ఇంటి తలు పులు తెరిచాడు. స్నానం చేసేసరికి ఆకలేసింది. ఉదయం మిగిలిన అన్నం, ఫ్రిజ్‌లో కూరలు వేసు కుని భోజనం అయిందనిపించి పడక్కుర్చీలో నడుంవాల్చాడు. అలాగే నిద్రలోకి జారుకున్నాడు.

మెలకువ వచ్చి చూసేసరికి టైము తొమ్మిది. అప్పుడు కంగారొచ్చింది జగన్నాథానికి. భార్య ఇంకా ఇంటికి రాకపోవడం గుర్తొచ్చి. ఇంటికి తాళం వేసి సుమతి పనిచేసే ఆఫీసుకు వెళ్ళేడు. ఆఫీసు గేటుకు పెద్ద తాళం కప్ప కనిపించింది.

'భార్య కొంపదీసి పుట్టింటికెళ్ళిందేమో!' అనుకు న్నాడు. ఔను. ఆమె తనతో చాలాసార్లు .... 'మీ మతి మరుపుతో వేగలేక చస్తున్నాను. ఎప్పుడో ఒక సారి మీతో చెప్పకుండానే నేను పుట్టింటికి వెళ్ళిపో తాను..'' అనేది. అలా తన మీద కోపం వచ్చి వెళ్ళి పోయిందేమో! అదే అయివుంటుంది. సారీ చెప్పి తీసుకొచ్చెయ్యాలి...' అలా అనుకుంటూ జగ





## సహజనటి

రైమా చాలా సెక్సీ ఫిగర్. అంతకు మించి అద్భుత మైన నటి. 'పరి ణీత', 'చోకేర్‌బాలి' సినిమాల్లో రైమా నటనని ఎవరూ మర్చిపోలేరు. అంత సహజంగా నటించింది. 'దస్'లో చెత్తపాత్ర వేసిన రైమా అదొక పొరపాటని అంగీకరిస్తోంది. పెద్ద నటులు వుండడంతో పేరొస్తుందని అనుకున్నాకానీ, వచ్చింది చెడ్డపేరు మాత్రమే అని అంటోంది. కాకపోతే 'పరిణీత'లో యాక్ట్ చేసిన తరువాత సెకండ్ హీరోయిన్ ఆఫర్స్ ఎక్కువగా వచ్చాయి. రైమా మాత్రం నిర్మొహమాటంగా తిరస్కరించింది. 'పరిణీత' చూసిన తరువాత రైమాది అద్భుతమైన ఇండియన్ ఫేస్ అని లాక్మే సంస్థ అవార్డిచ్చింది. ఇప్పుడు ఎన్నో యాడ్స్‌లో కూడా రైమా యాక్ట్ చేస్తోంది.

న్నాథం గబగబా బస్టాండుకు బయలుదేరాడు.

***

ఆరోజు ఆఫీసు నించి సినిమా హాలుకు వచ్చిన సుమతి టిక్కెట్లు కొని భర్త కోసం ఎదురు చూస్తూ నిలుచుంది. సినిమా ప్రారంభమయినా అతగాడు రాకపోయేసరికి విసుగొచ్చి బైట గేట్‌కీపర్‌కు చెప్పి సినిమా హాల్లో కూర్చుంది. సినిమా ఆమెకు నచ్చడంతో అలాగే చూస్తూ వుండిపోయింది. సినిమా పూర్తయి ఇంటికొచ్చేసరికి ఇంటికి తాళం కప్ప. 'పిచ్చి మొగుడు ఎక్కడికి పోయాడో' అనుకుంటూ తన దగ్గరున్న తాళంతో తలుపు తీసి జగన్నాథం కొలీగ్స్‌కు ఫోన్ చేసింది. చాలా మంది తెలీదన్నారు. ఒకాయన మాత్రం..''మీ వారు రామచంద్రాపురం బస్సెక్కడం నేను చూసాను. నేను ఆ బస్సు దిగుతున్నాను. ఎక్కడికండీ అని అడిగితే 'మా ఆవిడ పుట్టింటికి వెళ్ళింది. తీసుకురావడానికి వెళుతున్నాను.' అంటూ చెప్పారు.'' అని అన్నాడాయన.

'ఛీ... ఈ మొగుడితో ఎలా వేగేది.' అనుకుంటూ సుమతి వాళ్ళ అమ్మగారింటికి ఫోన్ చేసి విషయం చెప్పి, భర్తవస్తే వెంటనే తిరుగు బస్సులో పంపెయ్యమని చెప్పింది.

***

– ఇరవైయేళ్ళ తర్వాత...

జగన్నాథం ప్రొఫెసరయ్యాడు. తాత అయ్యాడు. ఆ తరువాత రిటైరయ్యాడు.

ఒక ఉదయంపూట నిద్రలోంచి లేచి...' 'సుమతీ కాఫీ!'' అంటూ అరిచాడు. ఐదు నిమిషాల తర్వాత అతడి కూతురు కాఫీ అందించింది.

''నువ్ తెచ్చావేం..అమ్మ పూజగదిలో వుందా'' అన్నాడు. ఆ మాటలకు ఆమె సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయింది.

అరగంట తర్వాత స్నానం చేసి, తయారై 'సుమతీ అలా బైటకు వెళ్ళొస్తాను' అంటూ ఇంట్లోంచి బైటకు నడుస్తున్న తండ్రిని చూసి నిట్టూర్చింది అతడి కూతురు.

ఆ రోజు రాత్రి నిద్రపోతున్న జగన్నాథానికి హఠాత్తుగా మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి ''సుమతీ'' అంటూ పిలిచాడు.

ఏ సమాధానం రాకపోవడంతో గబగబా బాత్రూమ్‌లోకి వెళ్ళాడు. ఆ తర్వాత వంటగది, హాలు వెతికాడు. 'సుమతి ఇంత అర్ధరాత్రి ఎక్కడకు వెళ్ళినట్టు?!' అలా అనుకుంటూ ఇంకో బెడ్ రూమ్ తలుపు తట్టాడు. కూతురు తలుపు తెరిచింది. అల్లుడు, మనవరాలు నిద్రపోతున్నారు.

''అమ్మ ఎక్కడికెళ్ళింది? కనబడదేం!'' అని అడిగాడు చికాగ్గా.

ఆ మాటలకు కూతురు మౌనం వహించింది.

''మాట్లాడకుండా అలా నిలుచున్నావేంటి?!'' అంటూ గట్టిగా అరిచాడు జగన్నాథం.

అతడి కూతురి కళ్ళల్లో నీళ్ళు.

జగన్నాథం ఆలోచిస్తూ పైకి చూసాడు. భార్య నిలువెత్తు ఫోటో గోడకు తగిలించి వుంది. ఫోటోకు దండ వేలాడుతోంది.

''అమ్మ పోయి నెలరోజులయింది. అన్నీ మరిచి పోయే నువ్వు అమ్మను మాత్రం ఎందుకు మరిచిపోలేకపోతున్నావు నాన్నా!'' అంటూ గద్గద స్వరంతో కూతురు వేసిన ప్రశ్నకు నవ్వుతూ వుండిపోయాడు.

తర్వాత అతని నవ్వు వెనకే కళ్ల వెంబడి కన్నీళ్ళు కూడా వచ్చాయి.

★